- గొల్ల కురుమల జీవితాల్లో వెలుగులు
- సబ్సిడీ గొర్రెలతో రూ.252 కోట్ల ఆదాయం
- 4.20 లక్షల వరకు గొర్రెల విక్రయం
- రూ.125 కోట్లతో 11,333 యూనిట్ల సబ్సిడీ గొర్రెలు పంపిణీ
- ఒక్కో లబ్ధిదారుడికి 21 గొర్రెల పంపిణీ
- రెండో విడుతలో 400 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పూర్తి

# 'ఎలమంద' మురువంగా..

## వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 22,643 మంది గొర్రెల పెంపకందారులు



వికారాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన గొర్రెల పంపిణీ కార్యక్రమంతో గొల్ల కురుమల జీవితాల్లో వెలుగులు నిండాయి. సబ్బండ వర్ణాల ప్రజలు ఆర్థికంగా పురోగతి సాధించేందుకు సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ, చేపల పెంపకం, దళితబంధు లాంటి పథకాలను అమలు చేస్తుండడంతో ఆయా వర్గాల ప్రజల జీవితాలు పూర్తిగా మారిపోయాయి. సబ్సిడీ గొర్రెల పంపిణీతో గొల్ల కురుమలు ప్రతి ఏటా రూ.2 లక్షల వరకు ఆదాయాన్ని అర్జిస్తూ ఆర్థికంగా బలోపేతమయ్యారు. సబ్సిడీ గొర్రెలు, వాటి సంతానంతో ఇప్పటివరకు ఆరు ఈతలు రాగా, సబ్సిడీ గొర్రెలతో ఏడాదికి ఒక్కో లబ్ధిదారుడు రూ.లక్ష వరకు ఆదాయం పొందారు. సంబంధిత లబ్ధిదారులు ఇప్పటికే ఆరు పర్యాయాలు గొర్రె పిల్లలతోపాటు ఉన్నితో లబ్ధి పొందారు. దాదాపు రూ.250 కోట్లకుపైగా గొల్ల కురుమలకు ఆదాయం వచ్చింది.

జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో 11,333 మంది లబ్ధిదారులకు రూ.125 కోట్ల విలువ చేసే 2.76 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా, వారి ఆదాయం రూ.250 కోట్లకుపైగా పెరగడం గమనార్హం. అదేవిధంగా సబ్సిడీ గొర్రెలు, వాటి ఈతలతో జిల్లాలో మొదటి విడుతలో పంపిణీ చేసిన లబ్ధిదారులు ఇప్పటివరకు 4.20 లక్షల గొర్రెలను రూ.6 వేల చొప్పున విక్రయించి రూ.252 కోట్ల వరకు ఆదాయం పొందారు. సబ్సిడీపై ఒక పొట్టేలుతో పాటు 20 గొర్రెలను పంపిణీ చేయగా.. ప్రతి లబ్ధిదారుడి వద్ద 50-80 వరకు గొర్రెల వరకు మంద పెరగడం గమనార్హం. గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగడంతోపాటు కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గతంలో కూలీ, నాలీ చేసుకొని బతికిన గొల్ల కురుమలకు గొర్రెలను పంపిణీ చేయడంతో ఆ కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండాయి. పారదర్శకంగా గొర్రెల పంపిణీ పథకాన్ని అమలుచేసేందుకు లాటరీ పద్ధతిలోనే లబ్ధిదారులను ఎంపిక చేశారు.

### గొర్రెల పంపిణీ పథకం సక్సెస్

గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం అద్భుత ఫలితాలను అందిస్తున్నది. తొలి విడుతలో సబ్సిడీపై రూ.1.25 లక్షల విలువైన 21 గొర్రెలను రూ.31,750కే అందించిన ప్రభుత్వం.. ఆతర్వాత యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచి లబ్ధిదారుడి వాటాగా రూ.43,450కే అందిస్తున్నది. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది జూన్ 9న జిల్లాలో రెండో విడుత గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రానికి ఎన్సీడీసీ రుణం ఇవ్వకుండా కేంద్రం మోకాలడ్డడంతో తెలంగాణ ప్రభుత్వమే సొంతంగా నిధులు సమకూర్చుకుని రెండో విడుత పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. జీవాలు అనారోగ్యానికి గురైతే సత్వరం వైద్యం అందించేందుకు సంచార వాహనాలను సమకూర్చింది. 108 తరహాలో టోల్‌ఫ్రీ నంబర్ 1962ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం దూరదృష్టితో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం సక్సెస్ కాగా.. ఏ గ్రామంలో చూసినా సర్కారు పంపిణీ చేసిన గొర్రెల మందలే కనిపిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా సమృద్ధిగా నాణ్యమైన మాంసం లభిస్తున్నది. గొర్రెల సంపద మూడింతలు పెరిగిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### వలసలు బంద్

ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధి లభించక.. తెలంగాణ గొల్ల కురుమలు ఇతర రాష్ట్రాలకు వలసపోయేవారు. కులవృత్తిని నమ్ముకుని గొర్రెలను పెంచుదామనుకుంటే జీవాలకు తాగడానికి నీళ్లు, తినడానికి మేత దొరకని పరిస్థితి. దీంతో పొట్ట చేతబట్టుకుని ఆయా కుటుంబాలు వలసపోయేవి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ గొల్ల కురుమలకు ఉపాధి కల్పించేలా సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేశారు. దీంతో వలస వెళ్లిన గొల్ల కురుమలు సొంతూళ్లకు తిరిగొచ్చారు. ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలతో సంతోషంగా జీవిస్తున్నారు. ఎవరి మధ్యవర్తిత్వం లేకుండా గొల్ల కురుమలే బేరగాళ్లుగా మారి క్రయివిక్రయాల ద్వారా ఉపాధి సైతం పొందుతున్నారు.

### బీఆర్ఎస్ పాలనలో కులవృత్తులకు గుర్తింపు



ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కులవృత్తులకు గుర్తింపు లభించింది. గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకు వచ్చిన సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకం ఎంతో బాగుంది. ఇదివరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కుల వృత్తులను అస్సలు పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ గొల్ల కురుమలకు సబ్సిడీపై 20 గొర్రెలు, ఒక పోటేలును అందిస్తున్నారు. గొర్రెల పంపిణీతో కులవృత్తులకు ఆదరువు లభించి గొల్ల కురుమల జీవితాల్లో వెలుగులు నిండాయి. గొల్ల కురుమల కష్టాలను తెలుసుకొని గొర్రెలను అందిస్తున్న సీఎం కేసీఆర్‌కి రుణపడి ఉంటాం. అన్ని కులాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్న సీఎం కేసీఆర్‌కే నా మద్దతు.

**- చెన్న వెంకటేశ్, కడ్తాల్ మండలం**

### గొర్రెల పంపిణీ గొప్ప పరిణామం



గతంలో ఏ ప్రభుత్వాలూ చేయని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో గొల్ల కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలు అందించడం గొప్ప పరిణామం. కులసంఘాలను ప్రోత్సహిస్తున్న సీఎం కేసీఆర్ గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షణీయం. ప్రభుత్వం అందించిన గొర్రెలతో గొల్ల కురుమలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

**- అచ్చిని అంజయ్య, అంతిరెడ్డిగూడ (షాబాద్)**

### సబ్సిడీ గొర్రెలు ఇవ్వడం సంతోషం



గొల్ల కురుమలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సర్కార్ సబ్సిడీపై గొర్రెలు అందించడం సంతోషకరం. గతంలో ఉన్న ఏ ప్రభుత్వాలూ గొల్ల కురుమలను పట్టించుకున్న పాపాన పోలేదు. అన్ని కులాలను అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ సార్.. గొల్ల కురుమలకు సబ్సిడీపై 21 గొర్రెలు అందించి అండగా నిలుస్తున్నారు. ఇలాంటి మంచి పనులు చేసే ముఖ్యమంత్రి మళ్లీ గెలిస్తే మరిన్ని మంచి పనులు చేస్తారు.

**- గొల్ల పర్వతాలు, కుమ్మరిగూడ (షాబాద్)**

### గొర్రెల పంపిణీతో మేము తలెత్తుకొని జీవిస్తున్నం



యాదవ, కురుమ వర్గాలకు చెందినవారు ఆత్మ గౌరవంతో తలెత్తుకు జీవించాలనే గొప్ప ఉద్దేశంతో మా కోసం సీఎం కేసీఆర్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం పక్కాగా అమలవుతున్నది. రాష్ట్రంలో పేద మధ్య తరగతి ప్రజల కోసం పైసా ఖర్చు లేకుండా 2017 నుండి ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. ఈ పథకంతో మెరుగైన ఫలితాలను మేము పొందుతున్నాం. ఒక గొర్రెల యూనిట్ విలువ రూ.1.25 లక్షలు. ఇందులో 75 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

**- కుర్వ రామప్ప, బెన్నూర్, యాలాల**




### గొర్రెలే జీవనాధారం

మాకు నలుగురు సంతానం.. అర ఎకరా పొలం ఉంది. పొలం పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించడం చాలాభారంగా ఉండేది. 5 సంవత్సరాల క్రితం ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేసింది. ప్రభుత్వం ద్వారా 21 గొర్రెలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుతం 70 గొర్రెలు అయ్యాయి. గత సంవత్సరంలో కూతురు పెళ్లి చేశాను. గొర్రెలపై జీవనాధారం సాగించడంతో మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు గొర్రెలు ఇవ్వడంతో మా బతుకులు మారాయి. కేసీఆర్ సార్‌కు ధన్యవాదాలు.

**- గొల్ల వెంకటయ్య, పులుమద్ది, వికారాబాద్**

### ఆశయ సాధనకు కృషి చేయాలి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



పట్నం రాజేందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తదితరులు

షాబాద్, నవంబర్ 8 : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజేందర్‌రెడ్డి 68వ జయంతిని పురస్కరించుకుని షాబాద్, ముద్దెంగూడ, గొల్లూరుగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే యాదయ్య, జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డిలతో కలిసి ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బలహీన వర్గాల ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతంలో రాజేందర్‌రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన నలాపురం మల్లారెడ్డి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు.

### గొర్రెల పంపిణీతో ఆర్థిక లబ్ధి



రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ప్రాధాన్యతనిచ్చింది. మా గొల్ల కురుమలకు గొర్రెలను అందించడంతో ఆర్థికంగా ఎదిగాం. గతంలో ఉన్న ప్రభుత్వాలేవీ మాకు గొర్రెలను ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన గొర్రెలతో మా కుటుంబమంతా లబ్ధి పొందాం. కుల వృత్తులకు అండగా ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటాం.

**- యాదమ్మ, రాంపూర్, తలకొండపల్లి**

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాది గొర్రెల పంపిణీ



గొల్ల కురుమ వర్గాల వారు తమ సంప్రదాయ వృత్తుల్లో సాధికారత సాధించడం కోసం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం సంజీవనిలా పనిచేస్తుంది. గొర్రెలను మాకు అందించడంతోపాటు గొర్రెలకు రూ.5000, పొట్టేలుకు రూ.7000 బీమాను కూడా ప్రభుత్వం అందిస్తున్నది. మొదటి, రెండు విడుతల్లో ఎంతో మంది లబ్ధి పొందారు. గొర్రెల ఉత్పత్తిలో రాజస్థాన్‌ను అధిగమించి తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. నీరు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రజలు తలెత్తుకు జీవిస్తున్నారు. అన్ని రంగాలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే.

**- కుర్వ అంజిలప్ప, లక్ష్మీనారాయణపూర్, యాలాల**